విద్యా ప్రమాణాలే ప్రామాణికం

- ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల నిర్ణయంపై ప్రభుత్వం యోచన
- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదిక పరిశీలన
- పరిగణనలోకి సుప్రీంకోర్టు తీర్పులు
- నిర్దేశిత సమయంలోనే ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలల్లో ఫీజుల నిర్ణయంపై హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా కళాశాలల్లో బోధన సిబ్బంది, బోధన స్థాయి, కళాశాలల్లో ల్యాబ్‌లు, భవనాలు.. ఇతర వసతులు... ఇలా ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి తదనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలనే భావనలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కృత్రిమ మేధ (ఎఐ) వంటి కోర్సులు సాంకేతిక రంగంపై బలమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో తెలంగాణలోని ఇంజినీరింగ్ కళాశాలలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పోటీ పడేలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు తగినట్లు కళాశాలలు ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ ప్రణాళికబద్ధంగా ముందుకువెళ్లేలా వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో మెరుగైన వసతులు, బోధన సిబ్బంది, ల్యాబ్‌లు.. ఏఐసీటీఈ మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండాలని ఆశిస్తున్నారు. ఫీజుల నిర్ణయానికి వీటినే ప్రాతిపదిక తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఫీజుల నిర్ణయానికి సంబంధించి ఇస్లామిక్ అకాడమీ ఆఫ్ ఎడ్యుకేషన్ వర్సెస్ కర్ణాటక, పీఏ ఇనాందార్ అండ్ అదర్స్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో... ఆయా కళాశాలల్లోని వసతులు, ల్యాబ్‌లు, లెక్చరర్లకు ఆ సంస్థ ఇచ్చే వేతనాలు, బోధన, బోధనేతర సిబ్బంది, కళాశాల భవిష్యత్ ప్రణాళికలు, కళాశాల ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న నిర్ణయాలను ప్రతిపాదిక చేసుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫీజుల నిర్ణయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంజినీరింగ్ కళాశాలల్లో వసతులు, బోధన సిబ్బంది.. ఇతర వ్యవహారాలపై గత ప్రభుత్వం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖతో తనిఖీలు చేయించింది. ఆ శాఖ క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసి నివేదిక రూపొందించింది. కానీ గత ప్రభుత్వం ఆ నివేదికపై ఎటువంటి చర్య తీసుకోలేదు. కానీ తమకు నచ్చిన కళాశాలలకు ఫీజులు పెంచుకునే అవకాశాన్ని కల్పించి.. మరికొన్ని కళాశాలలకు మాత్రం పక్షపాత వైఖరితో మొండి చేయి చూపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆ నివేదిక పరిశీలనతో పాటు ఇంజనీరింగ్ కళాశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలను మదింపు చేసి ఫీజులపై నిర్ణయం తీసుకునేందుకు ఒక కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్దేశిత సమయంలోనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

నేటినుంచి ఎప్‌సెట్ కౌన్సెలింగ్

జులై 1 నుంచి ధ్రువపత్రాల పరిశీలన

రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ (ఎంసెట్) తొలివిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి అధ్యక్షతన ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. శనివారం నుంచి వచ్చేనెల ఏడో తేదీ వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందనీ, ప్రాసెసింగ్ ఫీజు చెల్లించొచ్చనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. అదేనెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల ఆరు నుంచి పదో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి మొదటిసారిగా జోసా తరహాలో మాక్ కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చేనెల 13న మాక్ కౌన్సెలింగ్‌లో భాగంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు. అదేనెల 14,15 తేదీల్లో ఆప్షన్ల మార్పులకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ఒకవేళ మార్పులు చేయకుంటే వాటినే మొదటివిడత వెబ్‌ఆప్షన్లుగా పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. వచ్చేనెల 18న ఎప్‌సెట్ తొలివిడత ప్రవేశాలకు సంబంధించిన సీట్లను కేటాయిస్తామని పేర్కొన్నారు. అదేనెల 18 నుంచి 22 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

వర్క్‌షాపులో మాట్లాడుతున్న సారంపల్లి

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూ సమస్యలపై జులై 4న రాష్ట్ర సదస్సులు

- సర్వేలు చేసి ఆక్రమణ భూములను వెలికితీస్తాం
- ప్రభుత్వమూ సర్వే చేసి మిగులు భూమిని పేదలకు పంచాలి : సారంపల్లి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో భూ సమస్యలపై జులై 4న రాష్ట్ర సదస్సులు నిర్వహించి పోరాటాలకు సిద్ధం కావాలనీ, పెద్దల చేతుల్లో ఆక్రమణలకు గురైన భూములను బయటకి తీసుకేందుకు ప్రత్యేక భూ సర్వేలు చేయాలని ఏఐకెఎస్ అఖిల భారత ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన భూ సమస్య అనే అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపును నిర్వహించారు. ఈసందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ..రాష్ట్రంలో అనేక రకాల మిగులు, దేవాదాయ, చెరువు శిఖం, అసైన్డ్ భూములు పెద్దల చేతిలో ఆక్రమణకు గురయ్యాయన్నారు. వాటిని బయటికి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే చేయాలనీ, ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ధరణి, భూభారతి వంటి చట్టాలు పెద్దవాళ్లకే ఉపయోగపడుతున్నాయి తప్ప పేదలకు ఉపయోగం లేకుండా పోతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండాపోయిందన్నారు. ఆక్రమణలకు గురైన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఆ సంఘం రాష్ట్ర ఆఫీసు బేరర్లు బి ప్రసాద్, కొండమడుగు నరసింహ్మా, అన్నవరపు కనకయ్య, ఆవుల వీరన్న, సమ్మయ్య, ములకలపల్లి రాములు పెద్ది వెంకట్రాములు, మేకల ఆంజనేయులుతో పాటు రేపాకుల శ్రీనివాస్, మెరుగు సత్యనారాయణ, వెంకట్ మావో, నరసింహ, ఎం. సైదులు గుమ్మడిరాజుల రాములు, సంపత్, నరసింహులు, మోహన్ పాల్గొన్నారు.

వైఐఐఆర్ఎస్ ప్రాజెక్టుకు ఆర్థిక సహాయం అందించాలి

- కేంద్ర మంత్రి రాందాస్‌కు మంత్రి అడ్లూరి వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్(వైఐఐఆర్ఎస్) ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించాలని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల విద్యార్థుల భవిష్యత్‌ను మెరుగుపరచేందుకు ప్రభుత్వం "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ " ప్రాజెక్టును చేపట్టిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు లక్ష్యంగా ఈ ప్రాజెక్టును రూపొందించామని వివరించారు. ఈ మేరకు ఇప్పటివరకు రూ.200 కోట్ల ఖర్చుతో 55 పాఠశాలల నిర్మాణానికి ఆమోదం లభించిందనీ, ఈ పాఠశాలలు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించనున్నాయని తెలిపారు.

నర్మెటలో రాష్ట్రంలోనే తొలి రిఫైనరీ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ

- సిఎం చేతుల మీదుగా త్వరలో ప్రారంభం
- కాంగ్రెస్ హామీలను నెరవేరుస్తున్నాం
- మంత్రులు కోమటిరెడ్డి, పొన్నం, తుమ్మల, దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోనే మొదటి రిఫైనరీ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని నర్మెటలో నిర్మిస్తున్నామని, దాన్ని త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు అండగా ఉంటామని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలిపారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహతో కలిసి తుమ్మల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. హుస్నాబాద్‌లో రూ.82 కోట్లతో నూతనంగా నిర్మించిన 150 పడకల వైద్యశాల, రూ.11.50 కోట్లతో నిర్మించిన 50 పడకల మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. హాస్పిటల్‌లో ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, ఎన్‌బిఎస్‌యు, ఓపీ బ్లాక్, పోస్ట్ నెటల్ వార్డు, ఫార్మసీ ల్యాబ్, ప్రసూతి విభాగంను ప్రారంభించారు. అనంతరం రూ.77.20 కోట్లతో కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసల రహదారిగా (ప్యాకేజీ -2) మార్చేందుకు శంకుస్థాపన చేశారు. అనంతరం బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. హుస్నాబాద్‌లో హాస్పిటల్, ఇంజనీరింగ్ కాలేజీ, గౌరవెల్లి ప్రాజెక్ట్ మాత్రమే కాదు.. ఇక్కడి ప్రజలడిగిన పనులన్నీ మూడేండ్లలో పూర్తి అవుతాయని భరోసా ఇచ్చారు. అధికారం కోల్పోయిన వారు తమను విమర్శిస్తే అర్థం లేదని, వారి లాగా ఆకాశంలో హర్మ్యాలు కట్టి అరచేతిలో స్వర్గం చూపెట్టడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల బాగుకోసం రైతులకు నష్టం చేయడం దారుణమన్నారు. తెలంగాణలోనే అత్యాధునిక టెక్నాలజీతో ఎక్కువ కెపాసిటీతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఆగస్టు రెండో వారంలోపు ప్రారంభించనున్నట్టు తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. శాతవాహన యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కాలేజీలో ఈ సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం అవుతున్నాయన్నారు. అక్కన్నపేట నుంచి జనగాం వరకు నాలుగు లైన్ల రోడ్డు త్వరలోనే వస్తుందని, అలాగే ఎల్లమ్మ చెరువు అభివృద్ధి, ఇంజనీరింగ్ కాలేజీ, టూరిజ్ ప్రాజెక్టులు ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. మెడికల్ కాలేజీతో పాటు 150 పడకల ఆస్పత్రినీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులు ఇక్కడ పీజీ చదువుకునే విధంగా 50 పీజీ సీట్లు కూడా ప్రకటించారని తెలిపారు. అనంతరం మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సందర్శించి పనుల పురోగతిపై ఆయిల్ ఫెడ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ పామ్ రిఫైనరీ ప్యాకింగ్‌కి టెండర్ పిలిచి పనులు ప్రారంభం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ హేమావతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆయిల్ ఫెడ్ అధికారులు, హార్టికల్చర్ అధికారులు, గ్రంథాలయ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు

రూ.35 లక్షల్లోనే ఎంబిబిఎస్

- ఉజ్జేకిస్తాన్ యూనివర్శిటీతో భాగస్వామ్యం
- అపోలో మెడ్‌స్కిల్స్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

భారత్‌లో నీట్ పరీక్ష రాసి ఎంబిబిఎస్‌లో సీటు రాని విద్యార్థులకు విదేశాల్లోనూ చౌకగా ఎంబిబిఎస్‌ను పూర్తి చేసుకునే అవకాశం ఉందని అపోలో మెడ్‌స్కిల్స్ లిమిటెడ్ సిఇఒ డాక్టర్ శ్రీనివాస్ రావు పులిజల తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అపోలో గ్రూపులో భాగమైన తమ సంస్థ ఉజ్బెకిస్థాన్‌లో ఉన్న జార్మెడ్ యూనివర్సిటీతో భాగస్వామ్యం కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా విద్యా సంవత్సరం 2025-2026 నుండి జార్మెడ్ యూనివర్సిటీలో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల శిక్షణ కోసం అనుభవజ్ఞులైన భారతీయ ప్రొఫెసర్లను, అధ్యాపకులను, నిపుణులను అందిస్తున్నామన్నారు. అక్కడి సమర్కండ్, బుకార క్యాంపస్లలో భారతీయ విద్యార్థులకు మాత్రమే ఇంగ్లీష్‌లో ఎంబిబిఎస్‌ను బోధించనున్నామన్నారు. ఆరేళ్ల పాటు హాస్టల్ వసతి, నిర్వహణ సేవలు, భోజన ఏర్పాట్లు, ట్యూషన్ ఫీజులు, కోచింగ్ ఫీజులు, హాస్టల్ వసతి, భోజనం, ప్రాథమిక వీసా ప్రాసెసింగ్ తదితర అన్ని ఖర్చులు కలిపి మొత్తం రూ.35 లక్షల కంటే తక్కువ ఖర్చులోనే విద్యాభ్యాసం పూర్తి కానుందన్నారు. నేషనల్ మెడికల్ కమీషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారం ప్రకారం ఐదు సంవత్సరాల విద్యా ప్రణాళిక అపోలో మెడ్ స్కిల్స్ పర్యవేక్షణలో ఇవ్వబడుతుందన్నారు. ఒక సంవత్సరం జార్మెడ్ హాస్పిటల్స్ లో క్లినికల్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంను అందిస్తామన్నారు.

దేశానికి సెక్యులరిజం అవసరం లేదా..?

- ఆర్ఎస్ఎస్ పెద్దలను ప్రశ్నించిన చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశానికి సెక్యూలరిజం అవసరం లేదా? అని ప్రణాళికా సంఘం చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ సార్వభౌమత్వానికి, అన్ని కులాలు, మతాలు, వర్గాల ప్రజలకు రాజ్యాంగంలోని ప్రవేశిక పీఠిక రక్షణగా నిలుస్తోందని, అందులోని కీలకమైన సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రవేశికల్లోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను 1976లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్లమెంటు ఆమోదంతో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ చేర్చారనీ, అది దేశంలోని అన్ని కులాలు, మతాల వారికి రక్షణగా ఉందని పేర్కొన్నారు. ప్రవేశికలోని సెక్యులరిజం, సోషలిజం అంశాలను తొలగించేందుకు ఆర్ఎస్ఎస్ పెద్దలు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. వారికి కేవలం మతపరమైన రాజకీయాలే అవసరమని విమర్శించారు

ఆర్అండ్‌బిలో భారీగా ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖలోని ఇంజినీర్లకు భారీగా ఉద్యోగోన్నతులు లభించాయి. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. గతంలో ఎఇ, డిఇఇ, ఇఇ, ఎస్ఇసి ఇంజనీర్లకు ప్రమోషన్లు, పోస్టింగులు ఇస్తూ శాఖ పరమైన నిర్ణయం తీసుకోగా, తాజాగా ఒక్క రోజులోనే 64 మంది డిప్యూటీ ఇంజనీర్లకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ప్రమోషన్‌తో పాటు పోస్టింగులూ కల్పించారు. మంత్రి కోమటిరెడ్డి సిఎం రేవంత్‌ను ఒప్పించి ఏ శాఖలో లేని విధంగా ప్రత్యేకంగా రోడ్లు భవనాలు శాఖ లో ప్రమోషన్లు, పోస్టింగులు ఇప్పించారనే ప్రచారం ఆర్అండ్‌బిలో జరుగుతోంది. ఆర్ అండ్ బి సర్వీస్ నిబంధనలను సవరించి ఆరేళ్ల సర్వీస్ నిండిన 38 మంది అసిస్టెంట్ ఇంజనీర్లను, ఎఇఇలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఎఇఇ నుంచి డిప్యూటీ ఇంజనీర్లుగా 118 మందికి డిపార్ట్మెంట్ ప్రమోషన్ ప్యానెల్ (డిపిసి) ఆమోదం తెలిపింది. అందులో ఇప్పటికే 102 మందికి ప్రమోషన్లతోపాటు పోస్టింగులు సైతం ఇచ్చారు. అలాగే డిప్యూటీ ఇంజనీర్ల నుంచి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 72 మంది ప్రమోట్ కాగా, శుక్రవారం 64 మందికి ప్రమోషన్లు, పోస్టింగులు కల్పించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ల నుంచి సూపరింటెండెంట్ ఇంజనీర్లుగా 29 మందికి, సూపరింటెండెంట్ నుంచి చీఫ్ ఇంజనీర్లు గా నలుగురుకి (4) ప్రమోషన్లు వచ్చాయి.

నమ్మకాన్ని నిలబెట్టాలి: కోమటిరెడ్డి

కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ముగ్గురు సిఇలు ఇంజనీర్ ఇన్ చీఫ్‌లుగా పనిచేశారని, ప్రస్తుతం మహిళా ఇఎన్‌సి తిరుమల ఆర్ అండ్ బి శాఖకు హెచ్ఒడి స్థాయిలో సేవలు అందించాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ప్రమోషన్లు ఇచ్చామని చెప్పారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి శాఖ ఇంజనీర్లకు అందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. డిపార్ట్‌మెంట్‌లో ఖాళీలు కూడా వెంటనే భర్తీ చేసేందుకు రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఎప్పటికప్పుడు వివరాలు పంపుతున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని సూచించారు.

దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన పివి

మాజీ ప్రధానిని స్మరించుకున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పి.వి. నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పి.వి.నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు. పివి చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని అన్నారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారనీ, నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి గురుకుల విద్యకు తొలి అడుగులు వేశారని తెలిపారు. పీవీ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టినట్టు సిఎం తెలియజేశారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిందని గుర్తుచేశారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

నాటి సంగీత సాహిత్య విలువలు నేటి వారికి చేరాలి

- విఖ్యాత నేపథ్య గాయని సుశీల

ప్రజాశక్తి కల్చరల్

ఎందరో మహా కవులు రాసిన సాహిత్య పర విలువైన పాటలు సంగీత దర్శకులు తమ ప్రతిభతో స్వర రచన చేయగా అవి ఈనాటికి నిలిచి ఉన్నాయని విఖ్యాత నేపథ్య గాయని పి సుశీల అన్నారు. అటువంటి నాటి పాటలు నేటి తరంకు చేరాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. శారద మ్యూజిక్ అకాడమీ శ్రుతి లయ ఆర్ట్స్ నిర్వాహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శారద స్టూడియోస్‌లో ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు . ప్రముఖ గాయనీ గాయకులు ఆమని శారద ఉదయ్ మహేష్ రాజన్ సుభాష్ కృష్ణ ప్రసాద్ తదితరులు నాటి ఘంటసాల సుశీల యుగళ గీతాలు మధురం గా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ సుశీల స్వరం తెలుగు జాతికి వరం అన్నారు. ప్రముఖ గాయని అచ్యుత అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుశీల పాటల్లో మాధుర్యం నిరంతరం హంట్ చేస్తుంది అన్నారు. ప్రముఖ గాయకుడు త్రినాథ రావు కుసుమ భోగ రాజు భావన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్న సభలో సుశీల ను స్వర సామ్రాజ్ఞి బిరుదుతో అతిథులు సత్కరించారు.

సైన్స్ టీచర్ సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలి

- కెవిపిఎస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సైన్స్ టీచర్ సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వికారాబాద్ జిల్లా యలాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బయోసైన్స్ ప్రాక్టికల్‌గా అర్థం చేయించడానికి జంతువు మెదడు తెచ్చి బోధించినందుకు సాటి ఉపాధ్యాయులు మత విద్వేషాన్ని నింపుకొని విషయాన్ని పక్కదోవ పట్టించారని తెలిపారు. ఆ విషయాన్ని విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లి సస్పెన్షన్ చేయించారనీ, వారు నిజాన్ని తేల్చకుండానే అకారణంగా టీచర్‌ను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఉపాధ్యాయులలో కొందరికి మతోన్మాద భావజాలం బలంగా ఉందని దీంతో సాటి ఉపాధ్యాయునిపై కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని తెలిపారు. విద్యార్థులకు బయోసైన్స్ ప్రాక్టికల్‌గా అర్థం చేయించడానికి గొర్రె మెదడును తీసుకొచ్చిందని, కానీ అది ఆవు మెదడు అనే పేరుతో విద్వేషాలు రెచ్చగొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల్లో మత విద్వేషాలు నింపేవాళ్లు, మతోన్మాద దాడులు చేసే వాళ్ల సంఖ్య రోజు రోజుకి పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిఒ నెం.49 అమలు కాకుండా చూస్తాం

- ఆదివాసీ గిరిజనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వం జారీ చేసిన జిఒ నెం 49ను అమలు కాకుండా చూస్తామని ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటిడిఎ మీటింగ్ హాల్‌లో శుక్రవారం గిరిజన పెద్దలు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులను ఇబ్బందులకు గురిచేసే జిఒ నెం.49ను పూర్తిగా రద్దు చేయాలని ఎమ్మెల్యేలు, గిరిజన పెద్దలు డిమాండ్ చేశారు. దానిపై మంత్రి స్పందిస్తూ.. ఆ జిఒకు సంబంధించి ప్రభుత్వం ఇంకా గెజిట్ విడుదల చేయలేదని, ఈ విషయం అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చెప్పారని గుర్తు చేశారు. ఎంపి గోడం నగేష్ కల్పించుకుని.. ఇప్పటికే గెజిట్ విడుదల చేసినట్టు చెప్పారు. వెంటనే మంత్రి అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డా.సువర్ణతో ఫోన్‌లో మాట్లాడి అందరికీ వినిపించారు. గిరిజనులకు అన్యాయం చేసే ఏ పనీ ప్రభుత్వం చేయదని తెలియజేశారు.

ఒయులో ఫార్మసిస్ట్ పోస్టులకు 30న జాబ్‌మేళా

హైదరాబాద్ బ్యూరో : ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో - అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నారు. అపోలో ఫార్మసీలో వంద ఫార్మాసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసి 18 నుంచి 35 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులని, రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనముంటుందని తెలిపింది. మరిన్ని వివరాలకు అపోలో హెచ్‌ఆర్ విభాగానికి చెందిన టి రఘుపతిని (ఫోన్ నెంబర్: 82476 56356) సంప్రదించాలని సూచించింది. ధ్రువీకరణ పత్రాల జీరాక్స్ కాపీలతో హాజరుకావాలని పేర్కొంది.

రాష్ట్రానికి కేంద్రం మొండి చేయి

- గ్రాంట్లు, ఇతర సాయాల్లో శీతకన్ను
- పెరిగిన అప్పులు, తగ్గిన రాబడి
- కాగ్ నివేదిక వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్ల రూపంలో అందించాల్సిన సాయంలో కేంద్రం మొండి చేయి చూపించింది. సర్కార్ అంచనాలకు కేంద్రం ఇచ్చిన గ్రాంట్లకు పొంతన లేకుండా పోయింది. అలాగే అప్పులు పెరగగా, రాబడి తగ్గిందని 2025-26 ఆర్థిక సంవత్సరంలో మే వరకు రెండు నెలల రాబడి, వ్యయాలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక తెలిపింది. మొత్తం ఏడాది రెవెన్యూ రశీదుల అంచనా రూ.2,29,720.62 కాగా మే వరకు రూ.23,425.68 కోట్లు మాత్రమే వచ్చింది. మొత్తంగా 10.20 శాతం నమోదు కాగా గతేడాదితో పోలిస్తే 0.26 శాతం తగ్గింది. కేంద్రం నుంచి గ్రాంట్ల రూపంలో రూ.22,782.50 కోట్లు రావాల్సి ఉండగా, మే వరకు రెండు నెలల్లో కేవలం రూ.86.73 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్రం నుంచి రాష్ట్రానికి పన్నుల రూపంలో రూ.18,384.19 కోట్లు రావాల్సి ఉండగా, రూ2,192.62 కోట్ల రాబడి వచ్చింది. అలాగే రాష్ట్ర పన్నుల రాబడి అంచనా 1,75,319.35 కోట్లు కాగా మే వరకు 22,609.02 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. గతేడాదితో పోలిస్తే 0.74 శాతం అదాయం తగ్గింది. రాష్ట్ర అప్పులు అంచనాల కంటే పెరిగాయని కాగ్ తెలిపింది. మే వరకు బాండ్లు, ఇతర రూపాల్లో రాష్ట్ర ప్రభుత్వం 9,389.90 కోట్ల అప్పులు చేసిందని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 2.46 శాతం అదనంగా అప్పులు చేసింది. కేంద్రం నుంచి గ్రాంట్లు, పన్నుల రూపంలో రావాల్సి ఆదాయం గతేడాది కంటే తగ్గింది. అదే సందర్భంలో రాష్ట్ర నికర ఆదాయం తగ్గగా, అప్పులు మాత్రం పెరిగాయని కాగ్ నివేదిక పేర్కొంది.

టెన్త్ సప్లిమెంటరీలో 73.35 శాతం ఉత్తీర్ణత

- బాలికలదే పైచేయి
- వంద శాతం ఉత్తీర్ణతతో జనగామ ప్రథమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆన్‌లైన్‌లో విడుదలయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 42,834 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, 38,741 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. వారిలో 28,415 (73.35 శాతం) ఉత్తీర్ణత పొందారని తెలిపారు. వారిలో 23,976 మంది బాలురు పరీక్షలకు హాజరు కాగా, 17,034 (71.05 శాతం) మంది పాసయ్యారని పేర్కొన్నారు. 14,765 మంది బాలికలు పరీక్షలు రాస్తే 11,381 (77.08 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. బాలురు కన్నా బాలికలు 6.03 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రాష్ట్రంలో జనగామ జిల్లా వంద శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ జిల్లా నుంచి 75 మంది పరీక్షలు రాయగా అందరూ పాసయ్యారని వివరించారు. 55.90 శాతం ఉత్తీర్ణతను నమోదు చేసి సంగారెడ్డి జిల్లా చివరిస్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ జిల్లా నుంచి 195 మంది పరీక్షలు రాస్తే, 109 మంది ఉత్తీర్ణత పొందారని పేర్కొన్నారు. కొంత మంది విద్యార్థుల ఫలితాలను విత్ హెల్డ్‌లో పొందుపర్చామని తెలిపారు. వారి ఫలితాలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలను www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని వివరించారు. పది రోజుల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

రీకౌంటింగ్ దరఖాస్తు గడువు జులై 7

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు మార్కులను తిరిగి లెక్కించడం (రీకౌంటింగ్) కోసం దరఖాస్తు గడువు వచ్చేనెల ఏడో తేదీ వరకు ఉందని కృష్ణారావు పేర్కొన్నారు. ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా చలానా ద్వారా చెల్లించి దరఖాస్తులను నేరుగా కానీ, పోస్టు ద్వారా కానీ తమ కార్యాలయానికి పంపించాలని సూచించారు. విద్యార్థులు సంబంధిత పాఠశాలలో హాల్‌టికెట్లు, మెమో కాపీతోపాటు రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తులను వచ్చేనెల ఏడో తేదీ వరకు సమర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా అప్‌లోడ్ చేసి డీఈవో కార్యాలయానికి సమర్పించిన దరఖాస్తులను మాత్రమే అంగీకరించబడతాయని స్పష్టం చేశారు. రీవెరిఫికేషన్ కోసం పోస్టు ద్వారా పంపిన దరఖాస్తులను ఆమోదించబోమని వివరించారు. రీవెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని తెలిపారు. రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసిన విద్యార్థులు రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ)లను అంగీకరించబోమని తెలిపారు.

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

O.S. 77/2017

Between:

సత్తి అప్పారెడ్డి ...వాది

మరియు

శీలపోగు పవన్ కుమార్ ...ప్రతివాది

To,

శీలపోగు పవన్ కుమార్, S/o. (లేటు) బాస్కర రావు, వయసు 35 సం॥లు, డోర్.నెం. 9-3-129, సుభాష్‌నగర్ కాలనీ, భద్రాచలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణ.

పై నెంబరు దావాలో మీకు వాది గారు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపినను, మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున **ది.25-07-2025న ఉదయం 10.30 ని॥లకు** మీరు తూర్పు గోదావరి జిల్లా, అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని హజరు కావలెను. లేని పక్షంలో కోర్టు వారు మీ పరోక్షంలో తగునిర్ణయం తీసుకుందురని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయడం అయినది.

(శ్రీ కోర్టు వారు ఉత్తర్వులును అనుసరించి)

R.V.G. పట్నాయక్

వాది తరపు అడ్వకేట్
అనపర్తి, తూ॥గో॥ జిల్లా.

అనపర్తి
ది.26-06-2025

నిమ్స్ ప్రొఫెసర్లకు పదోన్నతులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నిమ్స్ ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పలువురు ప్రొఫెసర్లకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు శుక్రవారం నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ఆదేశాలు జాశారు. డాక్టర్ రోష్ని పాల్-పాథాలజీ, డాక్టర్ శాంత్వీర్ జి. ఉప్పిన్- పాథాలజీ, డాక్టర్ జి.కె.పరమజ్యోతి-పల్మనరీ మెడిసిన్, డాక్టర్ టి. గంగాధర్-నెఫ్రాలజీ, డాక్టర్ రాజు అయ్యంగార్-ఆర్థోపెడిక్స్, డాక్టర్ జె. నిర్మల-అనస్థీషియా, డాక్టర్ ఆషిమా శర్మ - ఎమర్జెన్సీ విభాగం, డాక్టర్ రాహుల్ దేవరాజ్-యూరాలజీ పదోన్నతులు పొందిన వారిలో ఉన్నారు.



మియాపూర్‌లో అంటెరా కిచన్ అవుట్‌లెట్ ప్రారంభం

హైదరాబాద్ : తెలుగు వంటకాలకు, ఆహ్లాదకరమైన డైనింగ్ అనుభవాలకు పేరుగాంచిన అంటెరా కిచెన్ అండ్ బార్ కొత్తగా మియాపూర్, మదీనగూడలో తమ ఆరో బ్రాంచ్‌ను ప్రారంభించింది. దీనికి అంటెరా భాగస్వాములు, మేనేజింగ్ డైరెక్టర్లు విజయ రెడ్డి కోట, నారాయణ రెడ్డి కోట, సౌమిత్ రెడ్డి కోట హాజరయ్యారు. తమ బ్రాండ్ తెలుగు వంటకాల సంప్రదాయాలపై అపారమైన ప్రేమను కలిగి ఉందని.. ఈ కొత్త బ్రాంచ్ కూడా ఈ వారసత్వాన్ని కొనసాగిస్తోందని సౌమిత్ రెడ్డి కోట పేర్కొన్నారు.

ప్రతిభ ఎవరి సొత్తూ కాదు

సాంస్కృతిక ఉత్సవాల్లో మాట్లాడుతున్న మురళీధరన్

- సాంస్కృతిక ఉత్సవాల్లో వికలాంగులను భాగస్వామ్యం చేస్తాం : వెన్నెల
- వికలాంగుల హక్కుల పరిరక్షణకు ఉద్యమిస్తాం : మురళీధరన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిభ ఎవరి సొత్తూ కాదని, సాంస్కృతిక ఉత్సవాల్లో వికలాంగులను భాగ్యస్వామ్యం చేస్తామని రాష్ట్ర సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్ గుమ్మడి వెన్నెల తెలిపారు. శుక్రవారం హెలెన్ కెల్లర్ 145వ జయంతిని పురస్కరించుకుని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థలు సంయుక్తంగా.. తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ.. వికలాంగులు ఒంటరి వాళ్ల కాదన్నారు. వారిలో ప్రతిభ, శక్తి సామర్థ్యాలు ఉన్నాయని, వారికి సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు, గౌరవం వస్తుందని చెప్పారు. అంగవైకల్యం ఉందని బాధపడకుండా ముందుకు సాగాలని, రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. సాంస్కృతిక శాఖ ద్వారా వికలాంగులకు అవసరమైన సహాయం చేస్తామని చెప్పారు.

ఎన్‌పిఆర్‌డి జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధరన్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వికలాంగుల హక్కులను కాలరాస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదని, పైగా వాటి వల్ల వికలాంగుల సంఖ్య పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సమానత్వం సాధించడమే వికలాంగుల ముందున్న కర్తవ్యం అని, హక్కుల పరిరక్షణకు ఉద్యమం చేస్తామని తెలిపారు.

హైదరాబాద్ మెట్రో పాలిటన్ కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి భాషా నావాజ్ ఖాన్ మాట్లాడుతూ.. వికలాంగులను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వికలాంగుల కోసం హెలెన్ కెల్లర్ విద్యాసంస్థలు చేస్తున్న కృషి ఆదర్శప్రాయమన్నారు. ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య మాట్లాడుతూ.. వికలాంగులు చదువుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. సైగల భాషను అభివృద్ధి చేయాలన్నారు. హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ ఉమర్‌ఖాన్ మాట్లాడుతూ.. మూగ, చెవిటి, అంధులు చదువుకోవడానికి విద్యాసంస్థలు లేకపోవడం వల్ల వారు ఉన్నత చదువులు చదవలేకపోతున్నారన్నారు.

ఈ సందర్భంగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 30 మంది విద్యార్థులకు రామిజా బీ మెమోరియల్ అవార్డ్స్ ప్రదానం చేశారు. హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల విద్యార్థులు చేసిన సాంస్కృతిక ఉత్సవాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టిఎఎస్‌ఎల్‌పిఎ రాష్ట్ర అధ్యక్షులు కె నాగేందర్, ప్రధాన కార్యదర్శి ఇమాద్ ఖాన్రూమాన్, జెఐఆర్‌డి వెల్ఫేర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి అనురాధ, ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వరమ్మ, కోశాధికారి ఆర్.వెంకటేష్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రాజు, స్వామి, కాషాప్ప, ఉపేందర్, గంగాధర్, యశోద, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ అర్ముగాం పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఆ లేఖ మావోయిస్టు పార్టీ ఇచ్చిందేనా..?

- అసహనం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క
- లేఖలో వాడిన బాషపై తీవ్ర అభ్యంతరం
- అదివాసీల జోలికి వెళ్లొద్దని అటవీ అధికారులకు స్పష్టంచేశామని వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీ హక్కులపై మాజీ మావోయిస్టు, మంత్రి సీతక్క పట్టించుకోవడం లేదని, జిఒ 49పై స్పందించడం లేదని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రికి మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధి జగన్ పేరిట వచ్చిన లేఖపై మంత్రి సీతక్క స్పందించారు. కొమురం భీం జిల్లాలో కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఏర్పాటుకు మేలో రాష్ట్ర ప్రభుత్వం జిఒ 49ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. గురువారం ములుగు జిల్లా ఏటూరునాగారంకు వచ్చిన మంత్రిని విలేకరులు ప్రశ్నించగా ఆమె స్పందించారు. తానెప్పుడు తన మూలాలను మరిచిపోలేదని, ఆదివాసీలు, గిరిజనుల హక్కులపై ఎప్పటికప్పుడు స్పందిస్తున్నానని తెలిపారు. ఇటీవల తనతోపాటు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం అటవీ శాఖాధికారులకు పోడుకు సంబంధించి గిరిజనులపై అక్రమ కేసులు పెట్టొద్దని స్పష్టంగా ఆదేశాలిచ్చామని తెలిపారు. మావోయిస్టు పార్టీ ఇచ్చామని చెబుతున్న లేఖ ఆ పార్టీనే ఇచ్చిందన్న దానిపై స్పష్టతలేదన్నారు. మావోయిస్టుల లేఖ పేరుతో మహిళ అని కూడా చూడకుండా అసభ్యపదజాలం వాడుతూ రాజకీయ కక్ష తీర్చుకుంటున్నారని ఆసహనం వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ నేతలు తనను సోషల్‌మీడియా వేదికగా టార్గెట్ చేస్తున్నారని, వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు వీడియోలు సృష్టిస్తున్నారని అన్నారు. మావోయిస్టుల పేరుతో చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని తెలిపారు. ఎవరైనా నిజాలనే మాట్లాడాలంటూ మావోయిస్టుల లేఖపై వివరించారు. జిఒ 49 రద్దు కోసం తాను చేసిన ప్రయత్నాలను వివరించారు. రాజకీయాలకతీతంగా ఎస్‌టి ఎమ్మెల్యేలతో సమావేశం ఏర్పాటు చేసి జిఒ 49ను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశామన్నారు.

యుఎఇతో వ్యాపారం సులభం

- ఫిక్కీ సమావేశంలో నిపుణులు

ప్రజాశక్తి - హైదరాబాద్

యుఎఇలోని షార్జా ప్రభుత్వ షార్జా ఎయిర్‌పోర్ట్ ఇంటర్నేషనల్ ఫ్రీ జోన్ (సైఫ్ జోన్) సహకారంతో అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపారం సులభం కానుందని భారత వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఫిక్కీ) సమావేశంలో నిపుణులు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో "యుఎఇ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లలో వ్యాపార విస్తరణ" వ్యాపార సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫిక్కీ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ కో చైర్మన్ సుధాకర్ పివిసి డైరెక్టర్ జయదేవ్ మీలా మాట్లాడుతూ.. భారతదేశం-యుఎఇ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సెపా) కింద అంతర్జాతీయ మార్కెట్లకు వ్యాపారాలను విస్తరించాలనకునే వారికి షార్జా ఓ మార్గమన్నారు. భారతీయ కంపెనీలు తమ ప్రపంచ కార్యకలాపాలను విస్తరించడానికి ఇది ఒక ఆదర్శ కేంద్రంగా ఉంటుందని సైఫ్ జోన్ డైరెక్టర్ జనరల్ సౌద్ అల్ మజ్రౌయి పేర్కొన్నారు.

కనుమరుగవుతున్న మానవతా విలువలు

- విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నాలో ప్రొ. హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రయివేట్, కార్పొరేట్ విద్యావ్యవస్థలతో మానవ విలువలు పూర్తిగా తుడిచి పెట్టుకుపోతున్నాయని, చదువు సరుకుగా మారిందని, దీనికి ప్రభుత్వాలే ద్వారాలు తెరిచాయని ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. విద్యను విధ్వంసం చేసే ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువులు సరుకులుగా మారటంతో సమాజం విషవృక్షంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్నవాడు చదవనివారు ఒకే విధంగా ఉంటున్నారన్నారు. కార్పొరేట్ విద్య వల్ల మానవీయత పూర్తిగా నశించిందన్నారు. తల్లిదండ్రులను చంపుతున్న పిల్లలు, పిల్లలను చంపుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. చదువులో విలువలు లేకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. కమిటీ అధ్యక్షులు కె.చక్రధర్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో కనీసం పది శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలని కోరారు. ఇంటర్నేషనల్ స్కూల్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని, 30 వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సెమీరెసిడెన్షియల్స్‌గా మార్చాలని సూచించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి బదులుగా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను, పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటీఐలను సమగ్రంగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగాలు వచ్చే నైపుణ్యాలను నేర్పించాలన్నారు.

సిపిఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెజి.రాంచందర్ మాట్లాడుతూ.. గతంలో ధనికులు పేదలు అన్న తేడా లేకుండా ఒకే పాఠశాలలో చదివే వాతావరణం ఉండేదని, కానీ పాలకులు కావాలనే ప్రభుత్వ విద్యను ధ్వంసం చేసి, ధనికులకు ఒక విద్య, పేదలకు మరో విద్య అందేలా ప్రయివేటు, కార్పొరేట్ విద్యారంగానికి ఊతమిచ్చారని విమర్శించారు. ఈ ధర్నాలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ప్రొ.లక్ష్మీనారాయణ, కమిటీ భాగస్వామ్య సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మహిళ ఆత్మహత్యాయత్నం

- ఖమ్మం జిల్లా వైరాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరమ్మ ఇల్లు రాలేదని మనస్తాపంతో ఓ నిరుపేద మహిళ ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన ఖమ్మం జిల్లా వైరా మున్సిపాల్టీ గండగలపాడులో శుక్రవారం జరిగింది. గండగలపాడు గ్రామానికి చెందిన నిరుపేద మహిళ కొనకళ్ల ఉషారాణి ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు పెట్టుకుంది. ఆమె 20 ఏళ్లుగా అద్దెకు ఉంటోంది. సెంటు భూమి లేదు. ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశ పడింది. కానీ కాంగ్రెస్ నాయకులు తనకు రాకుండా చేశారని ఆమె ఆరోపించింది. పైగా "నువ్వు మా పార్టీ కాదు.. నీకు ఇల్లు ఎలా వస్తుంది.. నీ జీవిత కాలంలో ఇల్లు రాదు" అంటూ కాంగ్రెస్ నాయకులు హేళన చేశారని మనస్తాపం చెందిన ఆమె.. ఇంట్లో కాలం చెల్లిన మందులు ఉంటే మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఉషారాణిని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

సంక్షోభంలో సాగునీటి రంగం

- మేడిగడ్డపై దుష్ప్రచారం ఆపాలి : హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సాగునీటి రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వహిస్తున్నదని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన లేక తెలంగాణ సాగు నీటి రంగాన్ని కాంగ్రెస్ సంక్షోభం లోకి నెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా కళ్లు తెరవాలని, మేడిగడ్డపై దుష్ప్రచారం ఆపేసి ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిపాదిత ప్రాజెక్టుల నిర్మాణ పనులు ముందుకు పోక, ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ లేక, కొత్త ప్రాజెక్టుల ఆలోచన రాక తెలంగాణ సాగు నీటి రంగం సంక్షోభంలోకి వెళుతున్నదని విమర్శించారు. తెలంగాణ నీటి రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, సాగును బాగు చేసిన ఘనత కెసిఆర్‌ది అయితే, ప్రాజెక్టులను పడావు పెట్టి, నిర్వహణ గాలికి వదిలి ఎపికి నీళ్లు వదులుతున్న ఘనత రేవంత్ రెడ్డిదని ఆరోపించారు.

ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనాలని విమర్శించారు. ఖమ్మంలో పెద్దవాగు కొట్టుకుపోయిందని, నల్లగొండలో సుంకిశాల కుప్ప కూలిందనీ, ఎస్‌ఎల్‌బిసి కుప్పకూలిందని, పాలమూరులో వట్టెం పంప్‌హౌజ్ జలమయమైందని, జోగులాంబ గద్వాలలో జూరాల ప్రాజెక్టు గేట్ల రోప్స్ తెగిపోయాయని, సంగారెడ్డిలో మంజీర డ్యాం ఆప్రాన్ వరద దాటికి కొట్టుకుపోగా, పియర్స్‌లలో పగుళ్లు వచ్చాయని ఆయన ఉదహరించారు. పాలన వైఫల్యం, కాంగ్రెస్ చేతగాని తనం వల్లే ఈ ప్రమాదాలు జరిగాయని పేర్కొన్నారు. ఇవేవి ఎన్‌డిఎస్‌ఎకు కనిపించవు, వినిపించవని అసహనం వ్యక్తం చేశారు. మేడిగడ్డ కుంగిన వెంటనే ఎన్‌డిఎస్‌ఎకు లేఖ రాసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి కాంగ్రెస్ హయాంలో జరుగుతున్న ప్రాజెక్టుల ప్రమాదాలు ఎందుకు కనిపించడం లేదు? అని ప్రశ్నించారు.

ఎమర్జెన్సీపై బిజెపి డ్రామాలు

- మాజీ ఎంపి వి హనుమంత రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో విధించిన ఎమర్జెన్సీపై బిజెపి నేతలు డ్రామాలాడుతున్నారని మాజీ ఎంపి వి హనుమంతరావు విమర్శించారు. ప్రజలు తీర్పు ఇచ్చిన తర్వాత కూడా ఇంకా బిజెపి ఎమర్జెన్సీపై మాట్లాడుతున్నదని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఇందిరా గాంధీ బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తారనే ఉద్దేశంతోనే కాంగ్రెస్‌కు అనుకూలంగా ప్రజలు తీర్పునిచ్చారని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్ ఇస్తామన్న హామీకి కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దీనిపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతుండటంతో ఎన్నికలు ఆగిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న కులగణన దేశానికి దిక్సూచి వంటి అని చెప్పారు.

నాటి సంగీత సాహిత్య విలువలు నేటి వారికి చేరాలి

- విఖ్యాత నేపథ్య గాయని సుశీల

ప్రజాశక్తి కల్చరల్

ఎందరో మహా కవులు రాసిన సాహిత్య పర విలువైన పాటలు సంగీత దర్శకులు తమ ప్రతిభతో స్వర రచన చేయగా అవి ఈనాటికి నిలిచి ఉన్నాయని విఖ్యాత నేపథ్య గాయని పి సుశీల అన్నారు. అటువంటి నాటి పాటలు నేటి తరంకు చేరాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. శారద మ్యూజిక్ అకాడమీ శ్రుతి లయ ఆర్ట్స్ నిర్వాహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శారద స్టూడియోస్‌లో ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహించారు . ప్రముఖ గాయనీ గాయకులు ఆమని శారద ఉదయ్ మహేష్ రాజన్ సుభాష్ కృష్ణ ప్రసాద్ తదితరులు నాటి ఘంటసాల సుశీల యుగళ గీతాలు మధురం గా ఆలపించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ మాట్లాడుతూ సుశీల స్వరం తెలుగు జాతికి వరం అన్నారు. ప్రముఖ గాయని అచ్యుత అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుశీల పాటల్లో మాధుర్యం నిరంతరం హంట్ చేస్తుంది అన్నారు.

హామీలు అమలు చేయలేక డైవర్షన్ రాజకీయాలు

- బిజెపి ఎంపి రఘునందన్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ రోజుకో కొత్త కథతో ముందుకొస్తున్నదని బిజెపి ఎంపి ఎం రఘునందన్‌రావు విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం పథకాలకు ఎప్పుడు కూడా వ్యక్తుల పేర్లు పెట్టలేదని చెప్పారు. ఇందిరమ్మ పేరు చెబితేనే చీకటి రోజులు గుర్తొస్తాయని కూడా కాంగ్రెస్ నేతలకు అవగాహన లేకుండా పోయిందని విమర్శించారు. కొత్త రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు లేవన్నారు. ఒక గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామ సభ పెట్టి ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు వచ్చాయా? లేదా? అనే దాన్ని తేల్చుదామని సవాల్ విసిరారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఏమైందని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ పార్టీకి ఓట్లు అవసరమున్నప్పుడే జై తెలంగాణ గుర్తుకొస్తుందని దెప్పిపొడిచారు.

కలుషిత నీటితో ప్రజలకు 'సున్నం'

- యధేచ్ఛగా వ్యర్థజలాల విక్రయం
- పట్టించుకోని అధికారులు
- సున్నం చెరువు నీటిని వాడొద్దన్న హైడ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంపాదనే ధ్యేయంగా పెట్టుకుంటున్న వ్యాపారులు ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రజల అవసరాలను ఆసరా తీసుకుని వ్యర్థజలాలను సైతం విక్రయిస్తున్నారు. హైదరాబాద్ మాదాపూర్ పరిధిలోని సున్నం చెరువు పరిసరాల్లో భూగర్భ జలాలు ప్రమాదకర స్థాయిలో కలుషితమయ్యాయని కాలుష్య నియంత్రణ మండలి పలుమార్లు హెచ్చరించినా వ్యాపారులు విచ్చలవిడిగా బోర్లు వేసి నీటిని తోడుతున్నారు. సమీపంలోని హాస్టళ్లు, వసతి గృహాలు, అపార్టుమెంట్స్, హోటళ్లకు, విద్యాసంస్థలు, ఐటీ సెక్టార్‌తోపాటు కావాల్సిన వారికి వాటిని ట్యాంకర్ల ద్వారా విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో యధేచ్ఛగా నీటి వ్యాపారం సాగుతూ ప్రజల ప్రాణం మీదకొస్తోంది. ఈ సమయంలో స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా రంగంలోకి దిగింది. సున్నం చెరువు నీటిని వాడొద్దని తెలిపింది.

పిసిబి ద్వారా నీటి నాణ్యత పరీక్షలు

చెరువులను పునరుద్ధరించే క్రమంలో హైడ్రా సున్నం చెరువును పరిశీలించింది. ఇక్కడి భూగర్భ జలాలు ఎంతటి ప్రమాదకర స్థాయిలో ఉన్నాయో అనే అంశాన్ని పిసిబి ద్వారా పరీక్షించింది. ముఖ్యంగా తాగునీరుగా సరఫరా చేస్తున్న ట్యాంకర్లలోని నీటి నమూనాలపై అధ్యయనం చేయించింది. ఇక్కడి నీటిలో సీసం, కాడ్మియం, నికెల్ లోహాల మోతాదులు అధికంగా ఉన్నాయని వెల్లడైంది. ఇవి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని పిసిబి హెచ్చరించింది.

12 రెట్లు అధికం

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో 0.01 మిల్లీగ్రాముల సీసం వరకూ ఉంటే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ సున్నం చెరువు చుట్టూ ఉన్న బోరు నీటిలో 0.073 - 0.122మిల్లీగ్రాములు ఉన్నట్టు పిసిబి గుర్తించింది. పిల్లల మెదడు చురుకుదనంపై ప్రభావం చూపడంతోపాటు, జ్ఞాపకశక్తిని తగ్గిస్తుంది. రక్తహీనతకు కారణమవ్వడమే కాకుండా, బాల్యం, యవ్వన దశలోనే కిడ్నీలపై ప్రభావం చూపుతుంది. రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, సంతానోత్పత్తిపైనా ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు.

2 నుంచి 3 రెట్లు అధికంగా కాడ్మియం

నీటిలో కాడ్మియం 0.003 మిల్లీగ్రాముల వరకు ఉన్నా పర్వాలేదని అంతర్జాతీయ ప్రమాణాలు చెబుతున్నాయి. అయితే, సున్నం చెరువు పరిసరాల్లోని బోరు నీళ్లలో 0.007 - 0.010 మిల్లీగ్రాములు ఉన్నట్టు తేలింది. కాడ్మియం మూత్రపిండాలపై ప్రభావం చూపుతుంది. మూత్రం ద్వారా ప్రొటీన్లు పోవడంతో ఎముకల బలహీనతకు దారి తీస్తుంది. క్యాన్సర్ వ్యాధికి కారణమౌతుందని ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చ్ ఆన్ క్యాన్సర్ వెల్లడించింది.

రెండు రెట్లు అధికంగా నికెల్

అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో 0.02 మిల్లీగ్రాముల మోతాదులో నికెల్ ఉంటే పర్వాలేదు. కానీ సున్నం చెరువు చెంత ఉన్న బోర్లలో 0.038-0.046మిల్లీగ్రాములు అధికంగా ఉన్నట్టు తేలింది. నికెల్ ఎక్కువ ఉంటే చర్మ సంబంధిత వ్యాధులతోపాటు, కాలేయం దెబ్బతింటుంది. తద్వారా మూత్రపిండాలు దెబ్బతింటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అధిక ఒత్తిడికి గురై చిన్న వయసులోనే రక్తపోటుకు కూడా కారణమౌతుందని వైద్యులు చెబుతున్నారు.

మరగబెట్టినా వదలని కాలుష్యం

సహజంగా నీటిని మరగబెట్టి తాగాలని వైద్యులు సూచిస్తుంటారు. కాలుష్య సాగరాల చెంత ఉన్న బోర్ల నుంచి వచ్చే నీటిని మరగబెట్టి వినియోగించినా ప్రయోజనం లేదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి నీటిలో క్రిములు నశించినా, సీసం, కాడ్మియం, నికెల్ వంటి భారీ లోహాలు కరగకపోగా, మరింత దగ్గరగా మారి ప్రమాదకరంగా ఉంటాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సున్నం చెరువు సమీపంలో ఇదే పరిస్థితి ఉందని పిసిబి పరిశోధనల ద్వారా వెల్లడైంది.

సున్నం చెరువుకు మొదటి ప్రాధాన్యం

ప్రమాదకర పరిస్థితుల్లో సున్నం చెరువు ఉందని గుర్తించిన హైడ్రా ఆ చెరువు పునరుద్ధరణకు మొదటి ప్రాధాన్యతనిచ్చింది. నగరంలో చేపడుతున్న ఆరు చెరువుల (మాదాపూర్‌లోని సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువు, అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట, పాతబస్తీలోని బమృక్ నుద్దౌలా చెరువు) పునరుద్ధరణలో సున్నం చెరువు ఉంది. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులోని గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య సున్నం చెరువు 32.60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువును కాలుష్యం నుంచి కాపాడి, మంచి నీరు నిలిచేలా దాదాపు రూ.10కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు హైడ్రా తెలిపింది. నీటి వ్యాపారులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు. ఎవరైనా కలుషిత నీటిని సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డ్రగ్స్ సృష్టి కర్త కెటిఆరే..

- టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డ్రగ్స్ విస్తరణ సృష్టికర్త మాజీ మంత్రి కేటీఆరే అని టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జెల కాంతం ఆరోపించారు. ఆయన డ్రగ్స్ కాంట్రాక్టు తీసుకున్నారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేళ్లలో తెలంగాణకు పది వేల కోట్ల డ్రగ్స్ సరఫరా చేశారని గుర్తు చేశారు. వెయ్యి మంది యువతను రంగంలోకి దించి అన్ని మండలాలు, గ్రామాలకు దాన్ని సరఫరా చేశారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టిల కుటుంబాలను సర్వ నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల కేంద్రాల్లో ఐదు వేల మందికి డ్రగ్స్‌ను అలవాటు చేశారని తెలిపారు. ఒకవైపు యువతను గంజాయి మత్తుకు అలవాటు చేస్తూనే, ఇంకోవైపు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేశారని విమర్శించారు. యువత జీవితాలను అతలాకుతలం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిపై సిఎం రేవంత్‌రెడ్డి ఉక్కుపాదం మోపారని తెలిపారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ఆయన కృషి చేస్తున్నారని కొనియాడారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు కోరారు. నగరంలో జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాల పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ట్వీట్ చేశారు. మేడ్చెల్ జిల్లా దుండిగల్ పరిధిలో జరిగిన హృదయవిదారకమైన రోడ్డు ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. అభం శుభం తెలియని ఐదేళ్ల బాలుడు టిప్పర్ చక్రాల కింద దుర్మరణం పాలు కావడం దారుణమని పేర్కొన్నారు. బాబును కోల్పోయి తీవ్ర విచారంలో ఉన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారికి కలిగిన నష్టం తీర్చలేనిదని తెలిపారు. ఇటీవల జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలు తీవ్ర భయాందోళనలను కలిగిస్తున్నాయని చెప్పారు. కళ్ల ముందే అయిన వారిని కోల్పోయిన కుటుంబ సభ్యులు, భరించలేని మానసిక వేదనకు గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. బాధ్యత గల ప్రభుత్వం దీనిపై వెంటనే దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. భారీ వాహనాలను పరిమిత సమయంలోనే నగరంలోకి అనుమతించాలన్న నిబంధనలను కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా పాఠశాల వేళల్లో భారీ వాహనాలు రోడ్లపై ప్రయాణించకుండా చూడాలనీ, స్కూల్ జోన్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఏ చిన్న పొరపాటు జరిగినా ఒక అమాయక ప్రాణం దానికి ఖరీదు చెల్లించవలిసి వస్తున్నదని పేర్కొన్నారు. వ్యవస్థాగత వైఫల్యాల వల్లనే, నిబంధనల అమలులో ఉన్న లోపాల వల్లనే రోడ్డు ప్రమాదాల్లో జనం ప్రాణాలు కోల్పోతున్నారనీ,. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా బలవుతున్నారని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనల అమలు, డ్రైవర్లకు తగిన శిక్షణ, మద్యం మత్తులో వాహనాలు నడపకుండా కట్టుదిట్టమైన చర్యలు, ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.